# వ్యసనానికి బానిస

—ఎ. వి. ఆర్. కె. ప్రసాద్

సూర్యం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఇంక్రిమెంట్ లేదు. ఇంటిఅద్దె ఇవ్వలేదు. ఈ రెండు చాలా ముఖ్యం. మిగిలినవి వీటి తర్వాతే. చార్మినార్ సిగరెట్టు ముట్టించాడు. ఈ సమస్యకి ఒకటే సొల్యూషన్.

'గుడికి' వెళ్తే (గుడిఅంటే సూర్యందృష్టిలోక్లబ్) ఆటమంచి రెయిజ్‌లో కొచ్చినప్పుడు వచ్చిన డబ్బుతో తృప్తిపడి తిరుగుడు ముఖంపడ్తాడు. బాకీలన్నీ తీర్చి వేయవచ్చు.

"కొద్దిగా కాఫీపెట్టవే!" అన్నాడు సిగరెట్ ఆఖరి దమ్ముతీస్తూ

"కాఫీపొడిలేదు. ఎలాకలపను? అయినా ఇప్పుడు కాఫీ ఏమిటి? భోంచేయరాదూ?'' సీత జవాబు.

''నాకాకలిగాలేదు. ముందర బామ్మగార్నడిగి తీసుకుని కలుపు.''

సీతకి బోధపడింది. భర్త ఎప్పుడు భోంచేయనంటాడో ఆరోజు తప్పకుండా క్లబ్బుకివెళ్తాడు కాఫీ కలిపిచ్చింది.

''పిల్లాడికి విరేచనాలు తగ్గలేదు. డాక్టరుకి చూపించాలి."

"రేపుచూపిద్దాంలే" అన్నాడు నిర్లక్ష్యంగా!

అయిదురోజులనుంచిచూస్తోంది రేపు,రేపు అంటారు. వాడుసగం అయిపోయాడు. మనిషి కెంత అశ్రద్ధ? ఎంతసేపూ వెధవ పేకాటతప్ప ఇంకేం అక్కరలేదు. సీత గొణుక్కుంది. సూర్యం ఎపుడో వెళ్ళిపోయాడు.

మర్నాడు హుషారుగా ఈలవేసుకుంటూ ఇంటికి వచ్చేసరికి సీత ఆనందం పట్టలేక "ఎంతొచ్చిందండి!'' అంది. "ముందర కాఫీపెట్టు'' చెప్తాఅన్నాడు.

అసలిక్కడ సూర్యం గురించి చెప్పాలి. సూర్యంది పెద్దకుటుంబం. అయిదుగురన్నదమ్ములు. పదెకరాలు పంచుకున్నాడు. సూర్యం ఒక్కడే కాస్త చదువుకున్నాడు. ఎస్ ఎస్. ఎల్. సి. పాసయాడు. మిగతా వాళ్ళంతా సొంత వ్యవసాయం చేసుకుని ఉన్నఊరు విడవక జీవితయాత్ర సాగిస్తున్నారు. తమ్ముడు చదువుకొని మంచి ఉద్యోగం చేస్తాడనుకొని కొంచెం ఎక్కువ పొలం ఇచ్చారు.

పాలిటెక్నిక్‌లో సీటొచ్చింది. కాకినాడలో మకాం. ఫ్రెండ్స్ ఎక్కువయ్యారు. ఫ్రీడమ్ ఎక్కువైంది. చుట్టూమూగారు. పేకాట నేర్పేశారు. సిగరెట్ అలవాటయింది. బాబాజరదా పాన్ వేసుకుంటే ఎంతోబాగుంటుందన్నారు. ఫాషన్‌గా ఉండాలి. పల్లెటూరివాడిలాగా ఆ అవతారం ఎమిటిగురూ! అనడిగారు.

సూర్యం మారిపోయాడు. చేతిలో సిగరెట్ కాగడాలా ఎపుడూ కాల్తూండ వల్సిందే. పాన్‌నవలందే ఉండడు. అమితాభ్‌బచ్చన్ హెయిర్ స్టైయిల్‌లా క్రాఫ్ మార్చాడు. రోజుకో డ్రస్‌లో సీటుగా తయారయేవాడు.

జమీందారులా ఉన్నావురా, కలుపు ముక్కలు అనేవారు.

రూమ్‌లో లాభంలేదు క్లబ్బుకిపోదాం నడవండి అన్నాడు కోటికి పడగెత్తిన కోటేశ్వర్రావు కొడుకు రాజు.

సరే అంటే సరే అన్నారందరూ సూర్యంతోసహా!

రోజూ క్లబ్బుకి వెళ్ళకుండా ఉండలేక పోయేవాడు. మనీఆర్డర్‌లొచ్చేవి.

ఎంతో బుద్ధిగా చదువు కుంటున్నాడనుకొనే వారు ఇంట్లో. ఎక్కడ ఇబ్బంది పడతాడేమోనని అడిగి నంతా ఇంటివద్దనుంచి పంపించేవారు. ఖర్చు పెరుగు తోంది. పొలం అమ్మేశాడు పెద్దవాళ్ళు చెప్పినా విన కుండా! చదువు పూర్తవలేదు. సెంటుభూమి లేని వాడయాడు. ఇంతలో మంచిఛాన్సు వచ్చింది. కూతు రికి పెళ్ళవదేమోనని ఓతండ్రి పిల్లనిస్తానంటూ సూర్యంవెంట పడ్డాడు. పెళ్ళయింది. కట్నంతో డిప్లొమా అయిందనిపించాడు. డిప్లొమాకు ఉద్యోగం రోజులు పోయాయి. ఉద్యోగంలేదు. ఎన్నో ప్రయ త్నాలు. ఫలితం శూన్యం. మామగారు పోయాడు. పిల్లలు పుట్టారు. అలవాట్లు పోలేదు. అప్పులు అస హ్యించుకున్నారు. ఎవరికాళ్ళో పట్టుకున్నాడు. హైదరా బాద్‌లో ఓ వర్కుషాపులో మెకానిక్ ఉద్యోగం దొరికింది. జీతం ఇంటి ఖర్చుకి సరిపోదు కార్లకింద వెల్లకిలాపడుకుని రిపేర్లు. బట్టలు నలుపెక్కి పోతు న్నాయ్. ఊహించని జీవితం చదువుకి తగని ఉద్యోగం నిరాశ నిస్పృహలు గూడు కట్టుకున్నాయ్. పూటగడిస్తే పూటగడవటం కష్టంగాఉంది.

వర్క్‌షాపునుండి క్లబ్బుకి పోవటం అలవాటయింది. ప్రయివేటుగా కొన్ని కార్లురిపేరు చేసుకొని డబ్బు సంపాదించవచ్చు. కాని సూర్యానికి ఎక్కువ కష్ట పడటం ఇష్టంలేదు. అదృష్టం కలిసిరావాలి. పేకాట తోనే సంపాయించవచ్చు. దానివల్లే ఇంట్లో గడుస్తుం దంటాడు. ఓసారి వంద రూపాయలు పోయి యాభై వచ్చినా ఎగిరి గంతేస్తాడు.

ఆరోజు ఇరవై రూపాయలతో వెళ్ళాడు. వందొ చ్చింది.

"బామ్మగార్కి ఇవ్వవలసిన పాతిక ఇచ్చేయండి. ఆరునెల్లయింది. అస్తమానూ అడుగుతొంది."

కాఫీ ఇస్తూ అడిగింది సీత

''ఇద్దాంలే" అన్నాడు నిర్లక్ష్యంగా!

''అలాంటే ఎలా? మీరు బాగానే ఉంటారు మధ్యన నేను-"

''సిక్కాదూ చెప్పేది పదిసార్లడక్కు"

చాపమీద పడుకుని సిగరెట్ కాలుస్తూ ఆలోచిస్తు న్నాడు.

రేషన్, అద్దె ఇచ్చేశాడు. ఇంకా ఇరవై మిగిలాయ్. కొన్ని అప్పులున్నాయ్. ఈ ఇరవైతో తీరేవికావు. తప్పదు వెళ్ళాలి.

"నేను రాత్రికిరాను అన్నం నాగురించి వండకు" అని వెళ్ళిపోయాడు.

సీత ఏడ్చింది. డబ్బులుంటే ఒక్కపైసా చేతిలో పెట్టరు.

పిల్లాడికి ఒక్క చొక్కా కూడా లేదు. తన చీరె లన్నీ చినిగి పోయాయ్.

పాత చీరలు కట్టుకుంటోంది.

ఉదయం ఇంటికొచ్చేడు. ముఖం పీక్కుపోయింది.

పాంటు షర్టు దుమ్ముకొట్టుకుపోయి అసహ్యంగా ఉన్నాడు.

చాపమీద వెల్లకిలా పడుకుని ఉన్న భర్తని చూసి సీత గ్రహించింది పేకాటలో పోయుంటుందని.

సూర్యానికి నిద్రపట్టేసింది.

విసుక్కుంటాడని లేపలేదు సీత.

పన్నెండు గంటలకి లేచి స్నానంచేసి రెండు మెతు కులు కొరికి రాత్రి నిద్రలేదేమో మళ్ళీ పడుకున్నాడు.

ఆరయింది.

'నూనె, కూరలు లేవు. వంటచేయటం ఎలాగా ?' అంది సీత కాఫీఇస్తూ.

'అవును ఎలాచేస్తుంది ?' నెమ్మదిగా ఓపిక చేసుకున్ని ఓ అర్థరూపాయి వంకాయలు, అయిదు పైసల కొత్తి మీర, కొంచెం నూనెతీసుకొచ్చి ఓ చిరునవ్వు నవ్వాడు.

అరువు పెట్టినపుడు ఓ చిరునవ్వు పడేయటం సూర్యానికి అలవాటే. ఆ చిరునవ్వుతోనే నెట్టుకొస్తు న్నాడని చెప్పొచ్చు.

కొట్టువాడు సరేనన్నాడు.

ఫోంచేసి పాన్ వేసుకొని ఓ సిగరెట్ వెలిగించి,

''అరుణనడిగి ఓ పదిరూపాయలు తీసుకో మళ్ళీ ఇచ్చేద్దాం." అన్నాడెంతో ఆప్యాయతగా.

'ఇవ్వరండి. ఇదివరకు ఇవ్వాల్సిన బాకీ తీర్చలేదు."

"ఈ సారి అంతా కలిపిచ్చేద్దాం తీసుకో."

"నేను తీసుకోను'' కోపంవచ్చింది సీతకి.

బాబ్బాబు బ్రతిమాలాడు.

"చేసేది లేక చంటిపిల్లాడిక్కి జ్వరం వచ్చింది మందులు కొనాలి" అని అబద్ధం ఆడింది అరుణతో.

అరుణ జాలిపడి ఇచ్చింది.

ఆనందంతో పది కాయితం కళ్ల కద్దుకుని ఇప్పుడే వస్తా అంటూ బయటకు వెళ్లిపోయాడు సూర్యం.

ఏం మనిషో! డబ్బు చేతిలో ఉన్నపుడు నాలుగూ కొనరు. లేనప్పుడు సరేసరి చెప్పనక్కర్లేదు. కొబ్బరి నూనె లేక పిల్లల జుట్టు తాటిపీచులా ఉంది.

గుక్కపెట్టి ఏడుస్తున్నాడు చంటిపిల్లాడు పాలు లేవు. బాకీ తీర్చలేదని పాలు పొయ్యలేదు పాలవాడు.

పడుకోరా వెధవ ! అని రెండు చరుపులు చరిచింది వీపుమీద నిర్దయగా. ఏడుస్తూ కూర్చుంది తను. నిద్ర ఎపుడు పట్టిందో తెలీదు.

మూడురోజు లయింది.

సూర్యం రాలేదు.

కూరలులేవు, కాఫీపొడి లేదు, ఇంటిలో ఉన్నవి ఒక్క బియ్యం. అవైనా ఉడికించుకోవటానికి కిరోసిన్ లేదు.

కిరోసిన్ బదులు తెచ్చింది. పచ్చడి మెతుకుల్తో ఎంగిలిపడ్డారు పిల్లలు, తనూ.

అయిదురోజులైంది సూర్యం వెళ్లి.

ఒళ్లు కాలిపోతోంది పిల్లాడికి. డాక్టర్ డబ్బుతో గాని పలకడు. డొక్కలు లోతుకుపోయి బల్లిలా పక్కకుహత్తుకుపోయి పడుకున్నాడు. సీత ఏడ్చింది. ఎంత సేపేడ్చిందో తెలియదు. ధైర్యంలేదు. భయం వేసింది పిల్లాడి పరిస్థితికి, ఓదార్చే దిక్కులేదు.

సూర్యం ఇంటికొచ్చాడు. సీత కళ్లు ఏడ్చిఏడ్చి వున్నాయేమో ఎర్రబడ్డాయ్. సీత మాట్లాడలేదు

హుషారుగా తిరిగే చంటాడు పడుకున్నాడు. నిశ్శబ్దంగా ఉంది.

పరిస్థితి అర్థమైంది సూర్యానికి. తనమీద తనకే అసహ్యం వేసింది. డాక్టరికి చూపించాలి వాణ్ణి. డబ్బు లేదు. ఛీ ! క్లబ్బుకెళ్ళకుండా ఉంటే ఎంతబాగుండేది ? ఇప్పుడు అప్పు ఎలా పుడుతుంది? పాత బాకీలు తీర్చకుండా. ఎలాగైనాసరే ట్రైచేయాలి.

వర్కుషాపులో తనోపన్జేస్తున్న రామారావు ఇంటికి వెళ్లాడు. "బాబ్బాబు ఈ సారికి ఇవ్వు తప్పకుండా ఇస్తాను.''

''అవసరం గడుపుకుందుకిపుడలానే అంటావ్. తర్వాత తీర్చడానిక్కి చంపుతావ్''

''ఈ సారి అలా చేయన్నా. జ్వరం పేలిపోతోంది మా చంటాడికి. డాక్టర్‌కి చూపించాలి."

రామారావుకి జాలికల్గింది.

సూర్యం ఇంక ఇవ్వడనే తీర్మానించుకొని ఓ పది రూపాయ లిచ్చాడు. డాక్టర్ ఇంజెక్షన్ చేసాడు.

రామారావు డబ్బు మంచిది జ్వరం తగ్గిపోయింది.

అప్పులు చాలా ఉన్నాయ్. తీర్చడం ఎలాగ ?

క్లబ్బుకెళ్లాలి. అదృష్టం బావుండి ఈ సారి కార్డులు కలిస్తే చిన్నచిన్న అప్పులు తీర్చివేయవచ్చు. సూర్యం ఆత్మ ప్రోత్సాహించింది. ''ఛీ!వద్దు వెళ్ళకూడదు. తన తోటివాళ్లు ఎంత ఆనందంగా జీవిస్తున్నారు. వాళ్లిలా నాకుమల్లే పిచ్చివేషాలువేసి భార్య, పిల్లల్ని పస్తులుంచటంలేదు. ఉన్నదాంతో తృప్తిచెందుతూ పొదుపుగా ఉంటూ సంసారాన్ని నెట్టుకొస్తున్నారు.

తన సంసారమో! గాణింపులేదు. భార్య, పిల్లల్ని ఏం సుఖపెట్టున్నాడు. సీతకి తను చేస్తున్నదేమిటి? కనీస సరదాలు తీర్చడంలేదు. ఒక్క చీర కొన్న పాపానపోయాడా! ఒక్క సినిమాకి తీసుకువెళ్లాడా! ఎపుడో పెళ్లయిన కొత్తలో వెళ్లాం అంతే!

మరో ఆత్మ ఆక్రోశించింది.

“ఛా! ఏమిటీ పిచ్చి ఆలోచనలు? క్లబ్బుకెళ్తే ఏం పోయింది? ఒకవేళ సుడిబావుండి డబ్బొస్తే సీతకి మంచి చీర, చంటాడిక్కి చొక్కా కొనచ్చు.”

‘వెళ్లాలి. తప్పదు’ అనుకుని దేవుడికి దణ్ణంపెట్టి క్లబ్బుకి వెళ్లిపోయాడు.

* * *

ఏ దేశ మేగినా ఎందుకాలిడినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని

—రాయప్రోలు